నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | బుధవారం 5 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్

కెరమెరి, జూన్ 4: పల్లె ప్రజలకు రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ సూచించారు. మంగళవారం కెరమెరి పీహెచ్‌సీని సందర్శించారు. రికార్డులు, వ్యాక్సినేషన్, ఇతర గదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలోని అన్ని గదులతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని, విధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు పరీక్షలు నిర్వహించి రక్తపోటు, షుగర్ వ్యాధులను నిర్ధారించాలని తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి వైద్యాధికారి వినోద్ కుమార్, సిబ్బంది ఉన్నారు.



కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్


ఆసిఫాబాద్ జిల్లాలోని జాతీయ రహదారి-364

# అడుగడుగునా అక్రమాలే

### జాతీయ రహదారి-364 పొడవునా భారీగా అవినీతి

- భూ పరిహారం చెల్లింపుల్లో గోల్‌మాల్
- అందినకాడికి దండుకున్న అధికారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు
- భూములు పోకున్నా కోట్లలో పరిహారం
- ఏసీబీ అధికారుల విచారణలో వెలుగు చూస్తున్న వైనం
- ఇప్పటికే ఏడుగురిపై కేసులు


నష్టపరిహారం చెల్లింపుల దస్త్రాలను స్వాధీనం చేసుకున ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి(ఫైల్)

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 4 (నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఆరేళ్ల క్రితం ప్రారంభమైన నాలుగు వరుసల జాతీయ రహదారి-364 నిర్మాణంలో అడుగడుగునా అక్రమాలు చోటు చేసుకున్నాయి. రూ. 1250 కోట్లతో చేపట్టిన ఈ రహదారి నిర్మాణం దాదాపుగా పూర్తికావస్తున్నది. వాంకిడి, రెబ్బెన మండలాల్లోని అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న యానిమల్ బ్రిడ్జి నిర్మాణాలు మినహా రహదారి నిర్మాణం దాదాపు పూర్తయ్యింది. రహదారి నిర్మాణం కోసం దాదాపు 320 హెక్టార్ల భూమి సేకరించారు. భూ పరిహారం చెల్లింపుల్లో భారీగా అవినీతి జరిగిందంటూ కొంత మంది బాధితులు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేయగాచ ఏప్రిల్ 24న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆసిఫాబాద్ ఆర్డీవో కార్యాలయం నుంచి రికార్డులు స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు. నష్టపరిహారం పొందిన వారి బ్యాంకు ఖాతాల వివరాలను పరిశీలించారు. నష్టపరిహారం పొందిన వారి ఖాతాల్లో నుంచి కోట్లాది రూపాయలు కొంతమంది రెవెన్యూ అధికారుల ఖాతాలకు, వారి బినామీ ఖాతాలకు బదిలీ అయినట్లు ఏసీబీ అధికారులు ఇటీవల విచారణలో వెల్లడించారు.

### భూ పరిహారంలో భారీగా అక్రమాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం రేపల్లెవాడ గ్రామం నుంచి వాంకిడి మండలం గోయగాం వరకు 54 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నిర్మించగా, భూ పరిహారం చెల్లింపుల్లో భారీగా అక్రమాలు జరిగినట్లు ఏసీబీ అధికారుల విచారణలో తేలింది. ఈ వ్యవహారంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్లాది రూపాయలు కాజేసినట్లు వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ అధికారులకు సైతం రూ. కోట్లలో ముడుపులు ముట్ట జెప్పినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే అవినీతికి పాల్పడిన ఏడుగురిని గుర్తించిన అధికారులు వారిపై కేసులు నమోదు చేసి, విచారణ కొనసాగిస్తున్నారు. గతంలో ఆసిఫాబాద్ ఆర్డీవోగా పనిచేసిన సిడాం దత్తు, డిప్యూటీ తహసీల్దార్ మెస్రం నాగోరావు, సర్వేయర్ భరత్, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు శంభూదాస్, లక్ష్మీనారాయణ గౌడ్, తిరుపతి, తారాబాయి పేరున ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించి పరిహారం చెల్లింపుల్లో జరిగిన అక్రమాలు, దీనికి సహకరించిన రెవెన్యూ అధికారుల పేర్లను ఎఫ్‌ఐఆర్‌లో నమోదు చేశారు. ఏసీబీ అధికారులు గుర్తించిన వివరాల ప్రకారం శంభూదాస్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి వద్ద డ్రైవర్‌గా పనిచేసే తిరుపతికి చెందిన ఎస్‌బీఐ ఖాతా నుంచి ఆర్డీ సిడాం దత్తు తల్లి సిడాం మల్కుబాయి ఖాతాలోకి రూ. 65 లక్షలు, మేస్రం నాగోరావు సోదరుడు మేస్రం చత్రుషా ఖాతాలోకి రూ. 30 లక్షలు జమ చేశారు. ఇవేగాక మిగతా వారి ఖాతాల్లో కూడా డబ్బులు జమ అయినట్లు తెలిసింది.. ఇలా మొత్తంగా రూ.కోటీ 15 లక్షల 19 వేలు జమచేసినట్లు గుర్తించారు. వీటికి సంబంధించిన ఆధారాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

### భూములు కోల్పోకున్నా పరిహారం..

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ వద్ద 15 ఎకరాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా రియల్‌ఎస్టేట్ వ్యాపారి శంభూదాస్ ప్లాట్‌లు చేసివిక్రయించారు. ఈ స్థలానికి కూడా నిబంధనలకు విరుద్ధంగా నష్టపరిహారం చెల్లింపులు జరిగినట్లు వెలుగుచూసింది. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు సైతం నష్టపరిహారాన్ని పొందినట్లు తెలుస్తోంది. ఈ తతంగంలో రెవెన్యూ అధికారులకు భారీ మొత్తంలో ముడుపులు అందినట్లు అధికారులు గుర్తించారు. కవాల్కర్ తారాబాయి అనే మహిళకు చెందిన సర్వే నంబర్ 66లోని భూమి కోల్పోకపోయినా దాదాపు రూ. 3 కోట్ల మేర నష్టపరిహారం చెల్లించినట్లు అధికారులు గుర్తించారు. నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో జరిగిన అవకతవకలపై ఇంకా విచారణ కొనసాగుతోంది. జిల్లాలో 54 కిలోమీటర్ల మేర జరిగిన రహదారి నిర్మాణంలో నాలుగు వరుసల రహదారి-364 నిర్మాణంలో భాగంగా భూసేకరణ, నష్టపరిహారం చెల్లింపుల్లో భారీ ఎత్తున అవినీతి జరిగినట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్, వాంకిడి, రెబ్బెన మండలాల్లో దాదాపు 320 హెక్టార్ల భూమిని అధికారులు సేకరించారు. డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారితోపాటు సర్వేయర్లు, డిప్యూటీ తహసీల్దార్లు ఇష్టానుసారంగా నష్ట పరిహారం చెల్లించి భారీగా అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు పెద్ద ఎత్తు వస్తున్నాయి. ఈ ఆరోపణల నేపథ్యంలో స్పందించిన ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. భూములు కోల్పోయిన వారి వివరాలతో పాటు, నష్టపరిహారం డబ్బులు పొందిన వారి ఖాతాల వివరాలను తీసుకొని లోతైన విచారణ చేపడుతున్నారు.

# కాంగ్రెస్ విజయం

## పెద్దపల్లి పార్లమెంట్‌లో 1,31,364 ఓట్ల మెజార్టీ

- మంచిర్యాల జిల్లాలో 69,679 ఓట్ల లీడింగ్
- అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే హస్తానికి తగ్గిన మెజార్టీ


పెద్దపల్లి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమిల్ ఖాన్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, కుటుంబ సభ్యులు

మంచిర్యాల, జూన్ 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పెద్దపల్లి పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు 1,93,356 ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి గొమాసె శ్రీనివాస్‌కు 3,44,224 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకష్ణకు 4,75,587 ఓట్లు వచ్చాయి. మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలో కలిపి 1,31,364 ఓట్ల మెజార్టీతో వంశీ గెలుపొందారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆయనకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. మంచిర్యాల జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు లీడ్ వచ్చింది. మొత్తం మెజార్టీలో సగానికి పైగా 69,679 ఓట్లు మంచిర్యాల జిల్లా నుంచి పడ్డాయి. కాగా, ఆరునెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్‌కు వచ్చిన మెజార్టీ భారీగా తగ్గడం గమనార్హం. గడ్డం వంశీ తండ్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రాతినిథ్యం వహిస్తున్న చెన్నూర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో 37,515 ఓట్ల మెజార్టీ రాగా, ఎంపీ ఎన్నికల్లో 25,714 ఓట్ల లీడ్ మాత్రమే వచ్చింది. బెల్లంపల్లిలో వంశీ పెద్దనాన్న గడ్డం వినోద్‌కు గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన మెజార్టీలో 12,298 ఓట్లు ఈ ఎన్నికల్లో తగ్గాయి. ఇక మంచిర్యాల నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే మెజార్టీలో 46,731 ఓట్లు తగ్గాయి. మొత్తంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఈ మూడు నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్‌కు వచ్చిన మెజార్టీలో 46 వేల ఓట్ల మెజార్టీ తగ్గింది. సొంత నియోజకవర్గాలైన బెల్లంపల్లి, చెన్నూర్‌లో దాదాపు 14వేల ఓట్ల మెజార్టీ తగ్గడం గమనార్హం.

### పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఇలా..

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు 1465 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకి 5,407 ఓట్లు, బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు 5116 ఓట్లు వచ్చాయి. మొత్తం 13,205 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయగా, వీరిలో 120 మంది నోటా(నన్ ఆఫ్‌దిఎబో) ఆప్షన్‌కు ఓటు వేశారు. 314 ఓట్లు తిరస్కరణకు గురికాగా, 411 ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. మొత్తం 13,205 ఓట్లలో 845 ఓట్లు నిరర్ధకంగా మారిపోయాయి. మొత్తంగా పోస్టల్ బ్యాలెట్‌లో కాంగ్రెస్‌కు 291 ఓట్ల మెజార్టీ వచ్చింది.


పెద్దపల్లి ఎంపీగా గెలుపొందిన అనంతరం విక్టరీ సింబల్ చూపిస్తున్న గడ్డం వంశీకృష

### సమర్థవంతంగా బాధ్యతను నెరవేరుస్తా ..

నాకు ఆశీర్వాదం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మా తాత కాక వెంకటస్వామి, నాన్న వివేక్‌లను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నా. వాళ్లను మనసులో పెట్టుకొని పెద్దపల్లి ప్రజలు నాకు ఓటు వేశారు. పెద్దపల్లి పార్లమెంట్ అభివద్ధి కోసం కష్టపడి పని చేస్తా. ఈ బాధ్యతను సమర్థవంగా నెరవేరుస్తా.

- గడ్డం వంశీకృష్ణ, పెద్దపల్లి ఎంపీ


ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కాలేజీలో కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సంతోష్

**2019(గత), 2024(ప్రస్తుత) పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీలు, అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు**

| పార్టీ | అభ్యర్థి | 2019లో వచ్చిన ఓట్లు | అభ్యర్థి | 2024లో వచ్చిన ఓట్లు |
|---|---|---|---|---|
| బీఆర్ఎస్ | వెంకటేశ్‌నేతకాని | 4,41,321 | కొప్పుల ఈశ్వర్ | 1,93,356 |
| కాంగ్రెస్ | ఆగం చంద్రశేఖర్ | 3,46,141 | గడ్డం వంశీకృష్ణ | 4,75,587 |
| బీజేపీ | సోగల కుమార్ | 92,606 | గొమాసె శ్రీనివాస్ | 3,44,224 |

### ప్రశాంతంగా కౌంటింగ్ పూర్తి

నస్పూర్, జూన్ 4 : జిల్లాలో లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. మంగళవారం ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో బెల్లంపల్లి, మంచిర్యాల, చెన్నూరు సహాయ రిటర్నింగ్ అధికారులు రాహుల్, రాములు, చంద్రకళ పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు జరిగిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 15 టేబుళ్ల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు అనంతరం భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎల్రక్టానిక్ ఓటింగ్ యంత్రాలను పూర్తి బందోబస్తు మధ్య గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపర్చినట్లు తెలిపారు.


ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కాలేజీలో కౌంటింగ్ చేస్తున్న సిబ్బంది


ఆసిఫాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ఎల్ ఈడీ స్క్రీన్‌పై ఫలితాలను వీక్షిస్తున్న ప్రయాణికులు, ప్రజలు

## టీవీలకు పరిమితమైన ప్రజలు

**ఆదిలాబాద్ పార్లమెంట్** ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ప్రజలు మంగళ వారం టీవీలు, సెల్‌ఫోన్లకు అంకితం అయ్యారు. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించగా, ఫలితాలను ఆసక్తిగా వీక్షించారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఎల్ ఈడీ స్క్రీన్‌పై ప్రయాణికులు, ప్రజలు ఫలితాల సరళిని పరిశీలించారు. ఇళ్ల నుంచి బయటకు ఎవరూ రాకపోవడంతో ప్రధాన చౌరస్తాలు, హోటళ్లు నిర్మానుష్యంగా కనిపించాయి. చాలాచోట్ల ఎన్నికల ఫలితాలపై పలువురు చర్చించుకోవడం కనిపించింది.

- ఆసిఫాబాద్ టౌన్/రెబ్బెన, జూన్4


దొనబండ గ్రామ శివారులో గాలికి లేచి పోయిన రేకులు


హాజీపూర్ శివారులో విరిగిన విద్యుత్ స్తంభం

# గాలివాన

హాజీపూర్/భీమారం/సీసీసీ నస్పూర్/రెబ్బెన, జూన్ 4 : మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలో మంగళవారం సాయంత్రం గాలివాన కురిసింది. పలుచోట్ల చెట్లు విరిగి పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. హాజీపూర్ శివారులో విద్యుత్ స్తంభం పడిపోవడంతో కరంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దొనబండ శివారులో ఓ షాపు ముందున్న షెడ్ రేకులు గాలికి ఎగిరి పోయాయి. భీమారం మండల కేంద్రంతో పాటు పోలంపల్లి, ఆరెపల్లి, దాంపూర్, ధర్మారం, ఖాజీపల్లి, కొత్తపల్లి, మద్దికల్ ఎల్కేశ్వరం గ్రామాల్లో మోస్తారు వర్షం కురిసింది. నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సీసీసీ, శ్రీరాంపూర్ ప్రాంతాల్లో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో వర్షం పడి వాతావరణం చల్లబడింది.


హాజీపూర్ మండల కేంద్రంలో జాతీయ రహదారి పక్కన విరిగి పడ్డ చెట్టు


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679